# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ గురువారం 24 జూలై 2025 | www.balagamtv.com | పేజీలు 4


## పెరిగిన బంగారం, వెండి ధరలు

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



పసిడి ధర మరోమారు రూ. 1 లక్ష మార్కును అధిగమించగా, కిలో వెండి ధర రూ. 1.15 లక్షలకు చేరి సరికొత్త గరిష్ఠస్థాయిని నమోదు చేసింది. అంతర్జాతీయ పరిస్థితులు, దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితి కారణంగా వీటి ధరలు పెరిగాయి. ఇండియన్ బులియన్ అండ్ జ్యువెల్లర్స్ అసోసియేషన్ విడుదల చేసిన సమాచారం ప్రకారం, 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.99,508 నుండి రూ.1,00,533కు పెరిగింది. 22 క్యారెట్ల బంగారం ధర కూడా గణనీయంగా పెరిగింది. నిన్న రూ.91,149గా ఉన్న పసిడి ధర ఈరోజు రూ. 92,088కి చేరుకుంది. 10 గ్రాముల 18 క్యారెట్ల పసిడి ధర రూ. 74,631 నుండి రూ. 75,400కు పెరిగింది.

వెండి ధర ఒక్కరోజేలోనే రూ. 1,357 పెరిగింది. కిలో వెండి ధర రూ. 1,14,493 నుండి రూ. 1,15,850కు చేరుకుంది. ఈ సంవత్సరం జనవరి నుంచి వెండి ధర 34 శాతానికి పైగా పెరిగింది. ఈ ఏడాది ప్రారంభంలో కిలో వెండి ధర రూ. 86,055గా నమోదైంది.

# 50 % పరిమితికి కాలం చెల్లింది

- ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతోనే 50 శాతం పరిమితి అంశం పక్కకు పోయింది
- కేంద్రం బీసీ బిల్లు ఆమోదించాలి
- ముస్లిం రిజర్వేషన్ల సాకుతో రిజర్వేషన్లకు బీజేపీ మోకాలడ్డు
- కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయడానికి ఢిల్లీ వచ్చాం
- దేశానికే రోల్ మోడల్‌గా తెలంగాణ కుల గణన
- ఓబీసీ రిజర్వేషన్లకు 2029 లోక్‌సభ ఎన్నికలు లిట్మస్ టెస్ట్
- ఇద్దరు పిల్లల నిబంధన ఎత్తివేయడంపై ఆలోచిస్తున్నాం...
- కుల గణనపై కాంగ్రెస్ ఎంపీలకు నేడు ఢిల్లీలో పవర్ పాయింట్ ప్రజంటేషన్
- ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో వెనుకబడిన తరగతులకు 42 శాతం రిజర్వేషన్లతో స్థానిక ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉన్నదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ శాసనసభ ఆమోదించిన బిల్లులకు చట్టబద్ధత కల్పించాల్సిన కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయడానికి ఢిల్లీ వచ్చినట్టు వివరించారు.


బీసీలకు విద్యా, ఉపాధి రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు, అలాగే స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించి తెలంగాణ శాసనసభ పూర్తిస్థాయిలో చర్చించి ఆమోదించిన రెండు బిల్లులను ఆమోదించడంలో కేంద్ర ప్రభుత్వం తాత్సారం చేస్తోందని అన్నారు. రాష్ట్ర హైకోర్టు 90 రోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, 30 రోజుల్లో రిజర్వేషన్లు ఖరారు చేయాలని ఆదేశించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. పలువురు ఎంపీలతో కలిసి ముఖ్యమంత్రి మీడియా సమావేశంలో మాట్లాడారు.

"ఈ రెండు బిల్లుల ఆమోదానికి కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ గారిని, రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే గారిని కలిసి తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ, కుల సర్వే జరిపిన తీరు, రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన శాస్త్రీయ విధానాలను వివరిస్తాం. తర్వాత ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలను కలిసి వివరించి వారి మద్దతు కోరుతాం. తద్వారా సమన్వయంతో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించి తెలంగాణ శాసనసభలో అన్ని పక్షాలు మద్దతు పలికాయి. తెలంగాణలో 4 ఫిబ్రవరి 2024 రోజున ప్రారంభించి 4 ఫిబ్రవరి 2025 నాటికి సామాజిక, ఆర్థిక, ఉపాధి, విద్యా, రాజకీయ, కుల సర్వేను పూర్తి చేశాం. అందుకే ఫిబ్రవరి 4 ను సామాజిక న్యాయ దినోత్సవంగా (సోషల్ జస్టిస్ డే) జరుపుతున్నాం. ఈ సర్వేలో తెలంగాణలో 3.55 కోట్ల మంది వివరాలు వెల్లడించారు.

సర్వే వివరాలపై మంత్రిమండలి ఆమోదం తర్వాత శాసనసభలో పూర్తిస్థాయిలో చర్చించాం. దాని ప్రకారం 56.4 శాతం బీసీలు, 17.45 శాతం ఎస్సీలు, 10.08 శాతం ఎస్టీలు, 10.09 శాతం ఉన్నత వర్గాల వారు ఉన్నారు. అలాగే 3.09 శాతం మంది తాము ఏ కులానికి చెందమని ప్రకటించారు. తెలంగాణలో ఇదో కొత్త పరిణామం. సర్వేపై స్వతంత్ర నిపుణుల సలహా కమిటీని నియమించి ఆ కమిటీకి ఇచ్చాం. వారు దానిపై చర్చించి నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించారు. ఆ నివేదికను మంత్రివర్గంలో చర్చించి శాసనసభలో ప్రవేశపెడతాం. సర్వే చేసినప్పటికీ డేటా ప్రైవసీ చట్టం ప్రకారం వ్యక్తిగత వివరాలు వెల్లడించకూడదని ఆ వివరాలను బహిర్గత పరచలేదు.

కుల గణన విషయంలో తెలంగాణ ప్రభుత్వం దేశానికి దిక్సూచిలా నిలిచింది. తొలుత కుదరన్న కేంద్ర ప్రభుత్వం కూడా వివిధ రకాల ఒత్తిళ్లతో జన గణనలో కుల గణన చేర్చింది. తెలంగాణ చేసిన సర్వే ఒక దిక్సూచిలా ఉంటుంది. దేశవ్యాప్తంగా జరిపే కుల గణన సేకరణకు కేంద్ర ప్రభుత్వం తెలంగాణ మాడల్‌ను వినియోగించుకోవాలలి.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగం అందరికీ ఒక్కటే. వేర్వేరు పార్టీలకు వేర్వేరు రాజ్యాంగం ఉండదు. రాజ్యాంగానికి లోబడి రిజర్వేషన్లు పెంచాలని అడుగుతున్నాం. వితండవాదాలకు తావివ్వకుండా తెలంగాణలో అమలు చేయతలపెట్టిన 42 శాతం బీసీ రిజర్వేషన్లను అమలు చేసుకోవలసిన అవసరం ఉంది. 2018 లో పంచాయతీ రాజ్ చట్టంలో రిజర్వేషన్లు 50 శాతం మించడానికి వీలులేదని పరిమితి విధించారు. ఆ పరిమితిని ఎత్తివేసి ఆ చట్టంలో సవరణలు చేస్తూ ఆర్డినెన్స్ జారీ చేశాం. దానిపై గవర్నర్ గారి కార్యాలయం కోరిన వివరాలను అందించింది. ఆర్డినెన్స్‌కు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు సంబంధం లేదు. దేశంలో 10 శాతం మేరకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల ఇవ్వడంతోనే 50 శాతం పరిమితి మిగితా 2వ పేజీలో




## మహాలక్ష్మి పథకంతో లాభాల్లోకి ఆర్టీసీ

- ఏడాదిలో 200కోట్ల మహిళా ప్రయాణం..
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి, మంత్రులు పొన్నం, కోమటి రెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల పెద్ద పీట వేసిందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మొదటి మహలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం 200కోట్ల ప్రయాణం చేసిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ వీసీ ఎండీ సజ్జన్నార్ ఆధ్వర్యంలో ఎంజీబీఎస్ ప్రాంగణంలో బుధవారం మహలక్ష్మి–మహిళల 200 కోట్ల ప్రయాణ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథులుగా ఆయన పాల్గొని మంత్రులు పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి లతో కలిసి మాట్లాడారు.. మునిగిపోతున్న పడవలాంటి ఆర్టీసీ ఎందుకు అని అనుకున్న సంస్థను మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ లాభాల్లోకి తెచ్చిందన్నారు. మహాలక్ష్మి పథకానికి సంబంధించిన జీరో టికెట్ల రియంబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఆర్టీసీకి చెల్లిస్తోందన్నారు. ఈ పథకం తో ఆర్టీసీ ఆర్థికంగా బలోపేతమవుతోందని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2400 కొత్త బస్సులను సంస్థ కొనుగోలు చేసినట్టు వెల్లడించారు. హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు 2800 ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలుకు టీజీఎస్ఆర్టీసీ కసరత్తు చేస్తోందని తెలిపారు. సంస్థలో ఇప్పటికే 11 శాతం ఎలక్ట్రిక్ బస్సులున్నాయని, ఉచిత ప్రయాణమే కాదు.. బస్సులకు మహిళలను తమ ప్రభుత్వం యజమానులను చేసిందని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.20 వేల కోట్లతో రోడ్ల మరమ్మత్తులు, అభివద్ధి చేయడానికి ప్రభుత్వం ప్లాన్ చేస్తోందని, దీంతో ప్రజా రవాణా వ్యవస్థ మరింతగా ప్రజలకు చేరువ అవుతుందన్నారు. ఆర్టీసీకి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తోన్న ఆర్టీసీ సిబ్బందిని అభినందించారు. మహిళల దైనందిన జీవితంలో మహాలక్ష్మి పథకం భాగమైందన్నారు. మహిళలు 200 కోట్ల ప్రయాణాలు చేసిన సందర్భంగా రాష్ట్రంలోని 97 డిపోలు, 324 బస్ స్టేషన్లలో ఘనంగా వేడుకలను నిర్వహిస్తున్నామని తెలిపారు. పెరిగిన రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులను కొనుగోలుతో పాటు నియామకాలను చేపడుతున్నట్లు వెల్లడించారు. ప్రయాణికులకు మెరుగైన రవాణా సదుపాయం, ఉద్యోగుల సంక్షేమానికి టీజీఎస్ఆర్టీసీ ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రతి గ్రామం నుంచి మండలానికి, మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి కొత్త రహదారుల నిర్మాణాన్ని త్వరలోనే ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం వల్ల మహిళలు తమ ప్రయాణ ఖర్చులను ఆదా చేసుకోవడంతో పాటు ఆర్టీసీకి కూడా మేలు జరుగుతోందన్నారు. టీజీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనర్ మాట్లాడుతూ.. మహాలక్ష్మి పథకాన్ని మిగితా 2వ పేజీలో

## రేపు క్యాబినెట్ భేటీ..

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర మంత్రి వర్గం శుక్రవారం భేటీ కానుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన. హైదరాబాద్‌లోని బీఆర్.అంబేద్కర్ సచివాలయంలో సాయంత్రం 4 గంటలకు జరిగే సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. రాష్ట్రంలో ప్రతి 15 రోజులకొకసారి మంత్రి వర్గ సమావేశం నిర్వహించాలని నిర్ణయించిన నేపథ్యంలో ప్రభుత్వం శుక్రవారం క్యాబినెట్ సమావేశం ఏర్పాటు చేసింది. స్థానిక సంస్థల ఎన్నికలు, బీసీ రిజర్వేషన్ల ఆర్డినెన్స్‌పై క్యాబినెట్ భేటీలో ప్రధాన చర్చ జరిగే అవకాశం ఉంది. వానాకాలం పంటసాగు, ఎరువుల కొరతపై సమావేశంలో చర్చించనున్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి ఆరోపణలపై కొనసాగుతోన్న విచారణలపై ఈ సమావేశం చర్చించనుంది. సంక్షేమ, అభివృద్ధి పథకాల నిధుల సమీకరణపె క్యాబినెట్ ప్రత్యేక దృష్టి సారించనుంది. వివిధ శాఖల అధికారులు మంత్రి వర్గం పరిశీలన కోసం ఆమోదించబడిన అజెండా అంశాలను గురువారం సాయంత్రానికి అందజేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు బుధవారం సర్క్యులర్ జారీ చేశారు.



## నిరవధిక వాయిదాలే

బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

బిహార్‌లో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణపై చర్చ చేయాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌తో మరోసారి పార్లమెంట్ కార్యకలాపాలు స్థంభించాయి. ఉభయ సభల్లో నిరసనలు, నినాదాలతో మరో రోజు పనులు నిలిచిపోయాయి. ప్రతిపక్ష సభ్యులు ఉభయ సభల్లోనూ నినాదాలు చేస్తూ స్పష్టమైన చర్చ డిమాండ్ చేశారు. దీంతో లోక్‌సభ, రాజ్యసభ రెండూ అనేకసార్లు వాయిదా పడుతూ చివరికి రోజంతా వాయిదా పడిపోయాయి.

లోక్‌సభలో ప్రతిపక్ష సభ్యులు సభా మండపం కేంద్రంలోకి దూసుకెళ్లి ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. దీనిపై స్పందించిన స్పీకర్ ఓం బిర్లా, "ఇది పార్లమెంటరీ ప్రవర్తన కాదు. వీరి ప్రవర్తన రోడ్డుపై జరుగేదిలా ఉంది" అని తీవ్రంగా వ్యాఖ్యానించారు.

రాజ్యసభ ప్రారంభమైన కొద్దిసేపటికే మొదట 12 గంటల వరకు వాయిదా పడింది. అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు మళ్లీ ప్రారంభమై వెంటనే మళ్లీ రోజంతా వాయిదా పడిపోయింది.

**ప్రాసెస్ లోనే స్పోర్ట్స్ పరిపాలన బిల్లు**

ఇలాంటి విఘాతం మధ్యలో 'జాతీయ క్రీడా పరిపాలన బిల్లు'ను పార్లమెంట్‌లో టేబుల్ చేయాల్సి ఉండేది. ఈ బిల్లు ప్రకారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి అధ్యక్షతన క్రీడా ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి, క్రీడలలో తలెత్తే వివాదాలకు వేగంగా పరిష్కారం కల్పించాలన్నది కేంద్ర ఉద్దేశ్యం. అయితే సభ కార్యకలాపాలు నిలిచిపోవడంతో, ఈ బిల్లుపైనా చర్చకి అవకాశమే లేకుండాపోయింది.

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో దేశ భద్రతపై ప్రధాన చర్చకు బాటలు వేస్తున్నాయి. పహల్గాం ఉగ్రదాడి, దానికి ప్రతిగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'పై జులై 29న లోక్‌సభ, రాజ్యసభల్లో సుదీర్ఘ చర్చ జరగనుంది. ఇటీవల జరిగిన పార్లమెంట్ బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో దీనిపై సమగ్రంగా చర్చించాలన్న నిర్ణయం తీసుకున్నారు. లభించిన సమాచారం ప్రకారం, లోక్‌సభలో 16 గంటలు, రాజ్యసభలో 9 గంటల పాటు ఈ అంశాలపై ఎంపీలు వాదోపవాదాలు కొనసాగించనున్నారు.

## కంచ గచ్చిబౌలి భూములు ప్రభుత్వానివే

బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

కంచ గచ్చిబౌలివి ప్రభుత్వ భూములే అని, అటవీ భూములు కాదని సర్వోన్నత న్యాయస్థానానికి రాష్ట్ర ప్రభుత్వం మరోసారి తేల్చి చెప్పింది. అందుకు సంబంధించిన రెవెన్యూ డిపార్ట్‌మెంట్ రికార్డులు, ఉమ్మడి ఏపీ ప్రభుత్వ హయాంలో అందుకు తగ్గట్టుగా రిలీజ్ చేసిన జీవోలను కోర్టుకు సమర్పించింది. ఈ భూమిని ఫారెస్ట్ ల్యాండ్‌గా ప్రకటించాలని సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సెంట్రల్ ఎంపవర్డ్ కమిటీ (సీఈసీ) పేర్కొన్న అంశాలు సరికాదని తెలిపింది. ఈ మేరకు మంగళవారం సమగ్ర వివరాలతో మొత్తం 43అంశాలతో కూడిన 56 పేజీల అడిషనల్ అఫిడవిట్‌ను రాష్ట్ర ప్రభుత్వం తరపున సీఎస్ రామకృష్ణారావు సుప్రీంకోర్టులో దాఖలు చేశారు. ఈ అఫిడవిట్‌లో 2001 లో అప్పటి ఉమ్మడి ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ పేరుతో జారీ చేసిన జీవో నెంబర్ 538, 2006లో కంచ గచ్చిబౌలి కార్టోసాట్ ఈమేజెనరీ, 2024లో తీసిన గూగుల్ ఎర్త్ ఈమేజేనరీ, 2025 ఏప్రిల్‌లో సేకరించిన సెంటినల్ శాటిలైట్ డేటాను ఈ అఫిడవిట్‌కు జత చేశారు. అలాగే... క్షేత్రస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం సేకరించిన వాస్తవాలు, ఇతర అంశాలతో కూడిన వివరాలను దీనికి పొందుపరిచారు.

సీఈసీ పేర్కొన్నట్టు కంచ గచ్చిబౌలి భూమి అటవీ భూమి కాదని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. గత అఫిడవిట్ లోనే ఈ అంశాన్ని స్పష్టం చేసినట్టు తెలిపింది. ఈ భూములు 'కంచ పోరంబోకు సర్కారీ' భూములుగా 1954–55 లోనే రెవెన్యూ రికార్డుల్లో నమోదైందని, ఈ భూముల్ని ప్రభుత్వం అటవీ భూమిగా గుర్తించలేదని తెలిపింది. 'కంచ' అంటే వ్యవసాయానికి లేదా పబ్లిక్ పర్పస్‌కు ఉపయోగించని భూమి అని వివరించింది. ఆ తర్వాత ఈ భూముల్ని 2001 అక్టోబర్‌లో ఆనాటి ఉమ్మడి ఏపీ ప్రభుత్వంలోని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్మెంట్ రూపొందించిన మాస్టర్ ప్లాన్‌లో 'పబ్లిక్ అండ్ సెమీ పబ్లిక్ యూజ్' కింద పేర్కొందని ప్రస్తావించింది. అనంతరం 2007 నుంచి ఈ భూమి వ్యవహారం కోర్టులో నడించిందని, దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ప్రభుత్వానికి చెందిందని కోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపింది. దీంతో ఈ భూమి దట్టమైన అటవీ ప్రాంతంగా మారినట్టు కార్టో సాట్, గూగుల్ ఎర్త్ ఈమెజేనరీ, సెంటిసెల్ శాటిలైజ్ చిత్రాలు చూపుతున్నాయని తెలిపింది.

నానక్ రాంగూడ, మాదాపూర్, రాయదుర్గం ప్రాంతాలను ఐటీ జోన్లుగా తీర్చిదిద్దేందుకు ఉమ్మడి ఏపీ, ప్రస్తుత తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఈ క్లస్టర్లలో దాదాపు రూ. 99, 880 కోట్ల ఇన్వెస్టర్లను ఆకర్షించిందనీ, తద్వారా 7.5 లక్షల మందికి ఉద్యోగావకాశాలు దక్కాయని తెలిపింది. ఇది హైదరాబాద్‌ను గ్లోబల్ క్యాపబిలిటి సెంటర్ల (జీసీసీ)ల గమ్యస్థానంగా మార్చిందని పేర్కొంది. 2024లో కొత్తగా70 జీసీసీలను ఆకర్షించినట్టు వివరించింది. తద్వారా రూ.16 వేల కోట్ల పెట్టుబడులు, 84 వేల మందికి జాబ్స్ రానున్నట్టు తెలిపింది. అందువల్ల ఈ 400 ఎకరాల్లో సుస్థిర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్లాన్ చేసింది.

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఇండస్ట్రియల్ పార్కులు, ఇతర చోట్ల 1.23లక్షల మొక్కలు నాటుతున్నట్టు అడిషనల్ అఫిడవిట్‌లో ప్రభుత్వం పేర్కొంది. ఇందులో మేడ్చల్ – సిద్దిపేట, శంషాబాద్, పటాన్ చెరు, సైబారాబాద్‌లో 40, 500 మొక్కలు నాటనున్నట్టు తెలిపింది. అలాగే 2.13 కోట్లతో ఎస్ఎఫ్ పీజీ వరంగల్, యెంకతల, గోల్కొండ ఆర్టిలరీ సెంటర్, జహీరాబాద్ నిమ్జ్‌లో 82, 500 మొక్కలు నాటుతున్నట్టు పేర్కొంది. వీటితో పాటు ఓఆర్ఆర్ ఇన్‌సైడ్, అవుట్‌సైడ్‌లో మొత్తం 135 ఎకరాల్లో మొక్కలు నాటుతున్నట్టు కోర్టుకు నివేదించింది. ఇందుకు సంబంధించిన ఫొటోలను కూడా అఫిడవిట్‌కు ప్రభుత్వం జత చేసింది.

## కొత్త పరిశ్రమలు రావాలి.. యువతకు ఉపాధి దక్కాలి

- ఇదే మా ప్రభుత్వ సంకల్పం, ఆ దిశగా చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాం
- పారిశ్రామికవేత్తలకు అన్ని రకాలుగా అండగా ఉంటాం
- పారిశ్రామికాభివృద్ధిలో పరిశ్రమలను భాగస్వామ్యం చేస్తాం
- పారిశ్రామిక సంఘాల ప్రతినిధుల భేటీలో మంత్రి శ్రీధర్ బాబు





బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణకు కొత్త పరిశ్రమలు రావాలి. ఇక్కడి యువతకు ఉపాధి దక్కాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో సీఐఐ, ఫిక్కీ, ఎఫ్ టీసీసీఐ, ఎలీప్, టిఫ్, టాప్మా, టీఎస్ టీఎంఏ తదితర పారిశ్రామిక సంఘాల ప్రతినిధులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. 'తెలంగాణ పురోగతిలో భాగస్వామ్యమవుతున్న పారిశ్రామికవేత్తలకు అన్ని రకాలుగా ఉంటాం. చట్టాలు, నిబంధనల పేరిట వారిని ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశం మాకు లేదు. రాష్ట్రంలోని ప్రతి పరిశ్రమను కాపాడుకుంటాం. ముఖ్యంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న ఎంఎస్ఎంఈ రంగానికి అండగా ఉంటాం. అలాగే... కార్మికుల ప్రయోజనాలను కాపాడుతాం' అని వివరించారు. 'గత ప్రభుత్వం మాదిరిగా ఏకపక్షంగా వ్యహరించం. మాది అందర్నీ కలుపుకుని పోయే ప్రభుత్వం. రాష్ట్రాభివృద్ధి కోసం అందరి సలహాలు, సూచనలు స్వీకరిస్తాం. వాటిని ఆచరణలో పెడతాం. పారిశ్రామికాభివృద్ధికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఈ ప్రయాణంలో పరిశ్రమలను భాగస్వామ్యం చేయాలని నిర్ణయించాం. అందుకే... పలు పారిశ్రామిక సంఘాల ప్రతినిధులతో సమావేశమై రాబోయే రోజుల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై మేధో మథనం చేశాం' అని పేర్కొన్నారు. 'పారిశ్రామికాభివృద్ధిలో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా మారింది. ఏడాదిన్నర వ్యవధిలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రానికి కొత్తగా రూ.3 లక్షలకు పైగా పెట్టుబడులను తీసుకొచ్చాం. ప్రైవేట్ రంగంలో లక్ష మందికి పైగా ఉపాధి కల్పించాం. అయినా... రాష్ట్రం నుంచి పరిశ్రమలు తరలి వెళ్లిపోతున్నాయంటూ బీఆర్ఎస్, బీజేపీ మాపై దుష్ప్రచారం చేస్తుంది' అని కొత్తగా రాష్ట్రానికొచ్చిన పెట్టుబడుల గురించి సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులకు వివరించారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై అవగాహన కల్పించారు. సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో తెలంగాణ మినమం వేజెస్ అడ్వైజరీ బోర్డ్ ఛైర్మన్ బి.జనక్ ప్రసాద్, ఐటీ, పరిశ్రమల శాఖ స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్, కార్మిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, పారిశ్రామిక సంఘాల ప్రతినిధులు సమీవుద్దీన్, రాజీవ్ వెంకటరమణ, రాంచంద్రారావు, శేఖర్ రెడ్డి, జయదేవ్, రాజీవ్, సుజాత, రమాదేవి, సుధీర్ రెడ్డి, సునీల్, గౌతమ్, అరుణ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలు ప్రీ ఫైనల్స్

- ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ మోసాలను ప్రజలకు చెప్పండి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- వికారాబాద్, సిర్పూర్, మునుగోడు నుంచి బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు పునాది వేసేలా స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయని, వీటిని ప్రీ ఫైనల్స్‌గా తీసుకోవాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. టికెట్ ఎవరికి వచ్చినా గెలిపించుకోవాలని, ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని సూచించారు.

వికారాబాద్ జిల్లాలో మళ్లీ గులాబీ జెండా ఎగరాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలిచ్చే బర్రెను పక్కన పెట్టి ఎగిరే దున్నపోతును తెచ్చుకున్నట్టు ప్రజలు భావిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ మోసాలతో విసిగిపోయిన ప్రజలు తమనే ఆశిస్తున్నారని, అందుకే బీఆర్ఎస్ అభ్యర్థులతో కాకుండా కారు గుర్తుతోనే ప్రజలు ఓటు వేయాలనే స్థితి రావాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజలను రూ. 2000 పెన్షన్‌ను రూ. 4000 చేస్తామని చెప్పి మోసం చేశారని, ప్రతి మహిళకు సూట్, రూ. 2500 ఇవ్వాలని చెప్పి ఎటువంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. రైతుబంధు నిధులను రాజకీయానికి వాడలేదని కేసీఆర్ పాలనలో జరిగిన అభివృద్ధిని గుర్తుచేశారు. కానీ ఇప్పటి ప్రభుత్వ పాలనలో ఒక్కసారి మాత్రమే రైతుభరోసా పంపిణీ చేసి పండుగ చేసుకున్నట్టు తయారైంది అన్నారు.

ఇప్పుడు పోలీసులు కూడా మిగితా 2వ పేజీలో

## రాష్ట్రాన్ని ముంచెత్తుతున్న వర్షాలు

**ఉపరితల ఆవర్తనం ప్రభావంతో 586 మండలాల్లో వానలు**

**ములుగు జిల్లాలో అత్యధిక వర్షపాతం**



బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్నాయి. ఎడతెరిపిలేని కుండపోత వానలతో పల్లెలు, పట్టణాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లుతున్నాయి. జలాశయాలు నిండుకుండలుగా మారాయి. వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో రహదారులపై రాకపోకలు స్తంభించాయి. ములుగు జిల్లా వెంకటాపురంలో అత్యధికంగా 25.5 సెం.మీ వర్షపాతం నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.

మొత్తం 33 జిల్లాల్లోని 621 మండలాలకుగాను 586 మండలాల్లో వర్షాలు నమోదైనట్టు పేర్కొంది. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తాత్కాలిక భద్రతా కేంద్రాలకు వెళ్లాలని అధికారులు సూచించారు. మరిన్ని వర్షాల అవకాశమున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది.

## ఉప రాష్ట్రపతి ఎన్నికకు సన్నాహాలు ప్రారంభం

**బలగం టీవీ, హైదరాబాద్**

జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాతో ఖాళీ అయిన ఉప రాష్ట్రపతి పదవికి ఎన్నిక నిర్వహించేందుకు సన్నాహాలు ప్రారంభించామని కేంద్ర ఎన్నికల సంఘం బుధవారం ప్రకటించింది. పార్లమెంట్ ఉభయ సభల సభ్యులతో కూడిన ఎలక్టోరల్ కాలేజీని ఏర్పాటు చేసే ప్రక్రియను మొదలు పెట్టామని తెలిపింది. లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతో పాటు నామినేటెడ్ సభ్యులు కూడా ఉప రాష్ట్రపతి ఎన్నిక కోసం జరిగే పోలింగ్‌లో ఓటు వేస్తారు. ఉప రాష్ట్రపతి ఎన్నిక నిర్వహణ కోసం రిటర్నింగ్ అధికారిని, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను ఖరారు చేసే పని కూడా జరుగుతోంది. 'సన్నాహకాలు పూర్తి చేసిన తర్వాత ఉప రాష్ట్రపతి ఎన్నిక కోసం షెడ్యూల్ ప్రకటిస్తాం. ఈ పని త్వరలోనే జరుగుతుంది' అని ఈసీ తెలిపింది. ఆరోగ్య కారణాలు చూపుతూ జగదీప్ ధన్‌ఖడ్ ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆయన రాజీనామాను కేంద్ర హోం మంత్రిత్వ శాఖ లాంఛనంగా నోటిఫై చేసింది. ఉప రాష్ట్రపతి పదవిలో ఉన్న వారు మరణించినా, రాజీనామా చేసినా లేక వారిని తొలగించినా 'సాధ్యమైనంత త్వరగా' ఆ స్థానాన్ని భర్తీ చేయాల్సి ఉంటుందని రాజ్యాంగంలోని ఆర్టికల్ 68లో క్లాజ్ 2 నిర్దేశిస్తోంది. ఎన్నికైన అభ్యర్థి ఐదు సంవత్సరాల పాటు ఉప రాష్ట్రపతి పదవిలో కొనసాగుతారు. నోటిఫికేషన్ జారీకి, ఎన్నిక జరిగే తేదీకి మధ్య 30 రోజుల వ్యవధి ఉంటుంది. 543 మంది సభ్యులున్న లోక్‌సభలో ఒక స్థానం ఖాళీగా ఉంది. 245 మంది సభ్యులున్న రాజ్యసభలో ఐదు స్థానాలు ఖాళీగా ఉన్నాయి. నామినేటెడ్ సభ్యులతో కలిపి ఉభయ సభలలో ప్రస్తుతం 786 మంది సభ్యులుండగా ఉప రాష్ట్రపతి పదవికి పోటీ చేసే అభ్యర్థి విజయం పొందాలంటే 394 ఓట్లు అవసరమవుతాయి. లోక్‌సభలో ఎన్డీఏకు 293 మంది సభ్యుల బలం ఉంది. అధికార కూటమికి రాజ్యసభలో 129 మంది సభ్యులు ఉన్నారు. నామినేటెడ్ సభ్యులు ఎలాగూ ఎన్డీఏ అభ్యర్థికి ఓటు వేస్తారు కనుక ఆ కూటమికి 422 మంది సభ్యుల మద్దతు ఉంటుంది.

## మహాలక్ష్మి పథకంతో లాభాల్లోకి ఆర్టీసీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రస్తుతం 7913 బస్సుల్లో అమలు చేస్తున్నామని, ఆయా బస్సుల్లో ప్రతి రోజూ సగటున 35 లక్షల మంది మహిళలు రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. ఈ పథకం అమలుకు ముందు ఆక్యుపెన్సీ రేషియో(ఓఆర్) 69 శాతం ఉండగా.. ప్రస్తుతం అది 97 శాతానికి పెరిగిందని తెలిపారు. ఈ పథకాన్ని విజయవం తంగా అమలు చేస్తోన్న ఆర్టీసీ సిబ్బందికి కతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్న మహిళలను, విద్యార్థులను, ఈ స్కీమ్‌ను సమర్థవంతంగా అమలు చేస్తోన్న ఆర్టీసీ సిబ్బందిని వారు సన్మానించారు. 200 కోట్ల ప్రయాణాల ద్వారా మహిళలు ఆదా చేసుకున్న రూ.6680 కోట్ల చెక్కును ప్రభుత్వం తరపున ఆర్టీసీ ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ వేడుకల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, హైదరాబాద్ కలెక్టర్ దాసరి హరిచందన, ఆర్టీసీ ఈడీలు మునిశేఖర్, ఖుస్రోషా ఖాన్, రాజశేఖర్, వెంకన్న, ఫైనాన్స్ అడ్వైజర్ విజయపుష్ప, ఇతర హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికలు ప్రీ ఫైనల్స్

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ నేతల ప్రోత్సాహంతో బీఆర్ఎస్ కార్యకర్తలపై కేసులు పెడుతున్నారని ఆరోపించారు. కానీ ఎన్నికల అనంతరం అదే పోలీసులు పైరవీల కోసం క్యూ కడతారని హెచ్చరించారు. మల్కాజిగిరిలో రోడ్డు మీద గూండాలు ఆర్భాటం చేస్తే పోలీసులు చూస్తూ కూర్చున్నారని విమర్శించారు.

**బీఆర్ఎస్‌లో భారీ చేరికలు**

తెలంగాణ భవన్‌లో జరిగిన సమావేశంలో వికారాబాద్, సిర్పూర్, మునుగోడు నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ పార్టీలకు చెందిన పలువురు నేతలు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి కేటీఆర్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం సీఎం రేవంత్‌రెడ్డి ప్రజల అభిప్రాయాల్లో పడిపోయారని, కేసీఆర్ మళ్లీ సీఎం కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

త్వరలో సిర్పూర్ నియోజకవర్గానికి వచ్చి బహిరంగ సభ నిర్వహిస్తానని కేటీఆర్ తెలిపారు. ప్రజలు కాంగ్రెస్ మోసాల నుండి తాము తప్పించుకోవాలంటే బీఆర్ఎస్‌కు తిరుగులేదని చెప్పారు. పార్టీ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. రైతులు, మహిళలు, విద్యార్థులకు న్యాయం జరగాలంటే బీఆర్ఎస్ విజయం సాధించాల్సిన అవసరం ఉందన్నారు.

## సాగర్‌కు భారీ వరద

**- శ్రీశైలంలో రెండు గేట్ల ద్వారా నీటి విడుదల**

**బలగం టీవీ, హైదరాబాద్**

నాగార్జునసాగర్ జలాశయానికి బుధవారం సాయంత్రం నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో సాగర్ జలాశ నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు 1,21967 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా.. పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకుగాను ప్రస్తుతం 574 అడుగులకు చేరుకుంది. సగటున రోజుకు 11 టీఎంసీల నీరు సాగర్ జలాశయానికి వస్తోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే నాలుగు రోజులలోపే సాగర్ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు చేరుకుంటుంది. శ్రీశైలం రెండు గేట్లను పది అడుగుల మేరకు ఎత్తి 54,956 క్యూసెక్కులను, కుడి, ఎడమ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా 66,827 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జున సాగర్ డ్యామ్ అధికారులు అప్రమత్తమయ్యారు. జలాశయం పూర్తి స్థాయికి చేరుకుంటున్న తరుణంలో ఎడమ కాలువకు సాగునీటిని ఈ నెలలోనే విడుదల చేసే అవకాశం ఉంది. ఎడమ కాలువ విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 3374 క్యూసెక్కులు, ఎస్ఎల్బీసీ ద్వారా 1800 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. కుడికాలువ ద్వారా 500 క్యూసెక్కులను బుధవారం సాయంత్రం నుంచి విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి వరదనీరు ఇలాగే కొనసాగితే సాగర్ డ్యాం గేట్లు ఎత్తి దిగువనకు నీటి విడుదల చేసే అవకాశం ఉంది.

# నగరంలో డ్రగ్స్ ముఠాలు అరెస్ట్

**బలగం టీవీ, హైదరాబాద్**




నగరంలో డ్రగ్స్ మాఫియాపై హైదరాబాద్ నార్కొటెక్ ఎన్‌ఫోర్సుమెంట్ (హెచ్‌న్యూ) పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఇందులో భాగంగానే ప్రత్యేక నిఘా వేసిన పోలీసులు సముద్రమార్గమున డ్రగ్స్ దిగుమతి చేసుకుని దేశవ్యాప్తంగా సరఫరా చేస్తున్న ఘరానా ముఠాల గుట్టురట్టు చేశారు. మూడు వేర్వేరు కేసుల్లో మూడు ముఠాల్లోని డ్రగ్స్ విక్రయ దారులు, సరఫరా దారుల్లో 9 మందిని హెచ్‌న్యూ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డ్రగ్స్ పెడ్లర్ల వద్ద తొలిసారి ఒక పిస్తోల్‌ను కూడా స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో కొకైన్, మెఫిడ్రీన్ సరఫరా చేస్తున్న వారున్నారు. నిందితుల నుంచి రూ.69లక్షల విలువగల 300 గ్రాముల కొకైన్, 100 గ్రాముల(ఎండీ) మీయాం మీయాం డ్రగ్స్, 12 మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు.

బుధవారం బషీర్‌బాగ్‌లోని పోలీస్‌కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీజీ, హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ వివరాలను వెల్లడించారు. డగ్స్ కేసులో నగరానికి చెందిన రవి కుమార్ వర్మ, సచిన్ అనే ఇద్దరు కీలక వ్యక్తులను పట్టుకుని వారి నుంచి ముఖ్యమైన సమాచారం సేకరించామన్నారు. రవివర్మకు ముంబయికి చెందిన ముఠాతో సంబంధాలున్నాయని, అక్కడ ఉన్న ముజఫర్ వాహిద్ షేక్ అనే వ్యక్తికి విదేశాల నుంచి కొకైన్ వస్తోందన్నారు. అతడి నుంచి నిందితులు హైదరాబాద్‌కు డ్రగ్స్ తీసుకొస్తున్నారని తెలిపారు. ప్రేమ్ ఉపాధ్యాయ్ అనే వినియోగదారుడిని అరెస్ట్ చేయడంతో ఈ ముఠా గుట్టురట్టయిందని తెలిపారు. 2022లో ప్రేమ్ ఉపాధ్యాయ్ డ్రగ్స్ తీసుకునే వాడని గుర్తించారు. ముంబయ్‌కి చెందిన డ్రగ్స్ ముఠాలతో ప్రేమ్‌కు సంబంధాలున్నాయని గుర్తించిన పోలీసులు ఆ కోణంలో విచారించారు. నైజీరియా నుంచి ముజాయిత్ డ్రగ్స్‌ను సముద్ర మార్గమున తెప్పించి సబ్ సప్లయర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. ప్రేమ్ ఉపాధ్యాయ్ అరెస్టు చేసి అతని వద్ద నుంచి పెద్దఎత్తున డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. మరో కేసులో రాజస్థాన్‌కు చెందిన జితేందర్‌ను అరెస్టు చేశారు. కొన్నేండ్ల క్రితం హైదరాబాద్‌కు వచ్చిన జితేందర్ స్వీట్స్ తయారీ చేసే దుకాణాల్లో పనిచేశాడు. ఆ తర్వాత స్విట్ షాప్ పెట్టాడు. అయితే అందులో నష్టాలు రావడంతో ఆర్థిక ఇబ్బందులు వచ్చాయి. డ్రగ్స్ విక్రయిస్తే సులువుగా డబ్బులు సంపాదించొచ్చని ఆలోచిన జితేందర్ రాజస్తాన్‌కు చెందిన సురేందర్, హనుమాన్‌లతో కలిసి ఒక ముఠాగా ఏర్పాడ్డాడు. ఈ ముఠా రూ.75వేలు పెట్టి కంట్రీ మెయిడ్ పిస్తోల్‌ను కొనుగోలు చేశారు. అదిపనిచేస్తుందోలేదో అని కాటేదాన్‌లో ఒక రౌండ్ బులెట్ ఫైరింగ్ చేశారు.

తాను ప్రేమించిన అమ్మాయి మోసం చేసిందని కారణంతో డ్రగ్స్‌కు అలవాటు చేసుకుని సరఫరాదారునిగా మారిన నిందితున్ని బొల్లారంలో నార్కొటిక్స్ పోలీసులు అరెస్టు చేశారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న హర్ష తరచూ గోవాకు వెళ్లేవాడు. అక్కడ క్రిస్ అనే డ్రగ్స్ పెడ్లర్‌తో పరిచయం అయింది. అతని నుంచి డ్రగ్స్ కొనుగోలు చేసిన నిందితుడు దాన్ని సేవించాడు. ఆ తర్వాత డ్రగ్స్‌ను విక్రయించడం మొదలు పెట్టాడు. పక్కా సమాచారంతో పోలీసులు నిందితున్ని అరెస్టు చేశారు. ఇదిలావుండగా వీసా గడువు ముగిసినా నగరంలో నివాసముంటున్న ఇద్దరు నైజీరియన్లను డిపోర్టు చేశారు. ఈ సమావేశంలో డీసీపీ వైవీఎస్ సుదీంద్ర, ఇన్‌స్పెక్టర్లు బాలస్వామీ, డ్యానియేల్, సైదులుతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# 50 % పరిమితికి కాలం చెల్లింది

(మొదటి పేజీ తరువాయి)

అంశం పక్కకు పోయింది. రిజర్వేషన్లకు 50 శాతం పరిమితి అన్న అంశానికి కాలం చెల్లిపోయింది. అనేక అంశాలను పరిగణలోకి తీసుకున్న తర్వాత వచ్చిన సర్వే ఫలితాల ఆధారంగా 42 శాతం బీసీల రిజర్వేషన్లను అడుగుతున్నాం. ఇది ఎవరో ఒక వ్యక్తి కోసం కాదు. మొత్తం జాతి కోసం అడుగుతున్నాం. వందేళ్ల తర్వాత కుల గణన జరిగింది. రిజర్వేషన్లను సాధించుకోవడానికి మేమంతా సిద్ధమై వచ్చాం. మేం దీనిపై పోరాటం చేస్తాం.." అని వివరించారు. ఈ మీడియా సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ అలీ షబ్బీర్, హర్కర వేణుగోపాల్ రావు, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, మల్లు రవి, బలరాం నాయక్, సురేష్ షెట్కార్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, రామసహాయం రఘురామిరెడ్డి, కుందూరు రఘువీర్ రెడ్డి, గడ్డం వంశీ కృష్ణ, కడియం కావ్య తదితరులు పాల్గొన్నారు.

ఉప రాష్ట్రపతిగా తెలంగాణకు చెందిన బండారు దత్తాత్రేయకు అవకాశం కల్పించాలని ఎన్డీఏ కూటమిని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.. ఆయన అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తే తాను ఇండియా కూటమి నేతలతో మాట్లాడాతానని అన్నారు.. ఢిల్లీలో ఆయన నేడు మీడియాతో మాట్లాడుతూ, దత్తాత్రేయకు ఆ పదవి ఇస్తే బిసిలకు, తెలుగు ప్రజలకూ న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు.

ఒక వర్గం పేరు చెప్పి తెలంగాణలో బీసీ రిజర్లేషన్లపై బీజేపీ మొండి వాదనను తెరపైకి తీసుకొస్తుందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవాలని కుట్రలు చేస్తున్న వాళ్లే సందేహాలను లేవనెత్తుతున్నారని కామెంట్ చేశారు. తెలంగాణలో సెప్టెంబర్ లోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిందని.. కేంద్ర త్వరగా రిజర్వేషన్ల బిల్లును ఆమోదిస్తే.. స్థానిక ఎన్నికలు నిర్వహిస్తామని కుండబద్దలు కొట్టారు. మూడు రైతు వ్యతిరేక చట్టాల విషయంలో ఏం జరిగిందో అందరూ చూశారని, రైతు చట్టాల రద్దు స్ఫూర్తిగా బీసీ రిజర్వేషన్ల చట్టం ఆమోదం కోసం పోరాడుతామని అన్నారు. ముస్లింల పేరుతో మరోసారి భావోద్వేగ రాజకీయాలు చేయాలని బీజేపీ చూస్తోందని.. తాము కల్పించే రిజర్వేషన్లలో మతం ప్రస్తావనే లేదని అన్నారు. బీసీలకు అన్యాయం చేసేలా గతంలో కేసీఆర్ పంచాయతీ రాజ్ చట్టానికి సవరణలు చేశారని, కానీ, తాము సామాజిక వెనుకబాటు ఆధారంగానే రిజర్వేషన్లు కల్పించ ప్రయత్నం చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

తెలంగాణ ప్రభుత్వం పంపిన రిజర్వేషన్ల బిల్ ఆమోదించకుండా ఆలస్యం చేస్తున్నారని కేంద్రంపై విరుచుకుపడ్డారు రేవంత్ . విద్య ఉపాధి అంశాలతో పాటు, స్థానిక సంస్థల రిజర్వేషన్ల రెండు బిల్లులను ఆమోదించడం లేదన్నారు. మత ప్రాతిపదికన రిజర్వేషన్లు లేవని.. మతాలు ప్రాతిపదిక కాదన్నారు. వెనుకబాటు తనమే తమ ప్రాతిపదిక అని స్పష్టం చేశారు.దీనిపై రేపు ఉదయం మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలను కలుస్తామని తెలిపారు.. సర్వే వివరాలు వివరిస్తామని స్పష్టం చేశారు. తమ తరపున పార్లమెంట్ లో ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరతామన్నారు. రేపు సర్వే కోసం జరిగిన ప్రక్రియ పై కాంగ్రెస్ ఎంపీలకు వివరిస్తామని వెల్లడించారు. జనగణనలో కుల గణన చేర్చాలని.. జనగణనలో కులగణన ఎలా చేయొచ్చు.. దేశానికి తెలంగాణ మోడల్ గా నిలిచిందో వివరిస్తామన్నారు. తాము చేసిన సర్వే దేశానికి రోల్ మోడల్ అని చెప్పారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి తమ కార్యాచరణ సిద్ధం చేశామని వెల్లడించారు. కేంద్రం రిజర్వేషన్లను ఆమోదించాలని.. అందుకే కేంద్రం పై ఒత్తిడి తేవాలన్నారు. అవసరం అయితే కూటమి నేతలను కూడా కలుస్తామని చెప్పారు.

సోషల్ జస్టిస్ కు అందరూ సహకరించాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. "గుజరాత్, యూపీ, మహారాష్ట్రలో ముస్లింలకు రిజర్వేషన్లు ఉన్నాయి. అక్కడ ముస్లిం రిజర్వేషన్లు తొలగించి బీజేపీ నేతలు తెలంగాణ గురించి మాట్లాడాలి. బీజేపీ నేతలు వితండ వాదం చేస్తున్నారు. ఒక ఇంటర్వ్యూలో ముస్లిం రిజర్వేషన్లు అమలు చేస్తాం అని అమిత్ షా అన్నారు. ఆయన్ను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తారా..? కేంద్రం తక్షణమే బిల్లును ఆమోదించాలి. సర్వేను శాసన సభలో ప్రవేశ పెట్టి పూర్తి స్థాయిలో చర్చకు అవకాశం ఇచ్చాం. వ్యక్తుల వ్యక్తిగత వివరాలను బహిరంగ పరచలేదు. 3.9 శాతం ప్రజలు తమకు ఏ కులం లేదని డిక్లేర్ చేశారు. ఎక్స్పర్ట్ కమిటీ ఇచ్చిన రిపోర్ట్ ను రోడ్ పై పెట్టలేం. ఫస్ట్ క్యాబినెట్ ముందు పెట్టాలి. శాసన సభలో ప్రశ్నిస్తే.. సమాధానం చెప్తాం. అడిగిన వివరాలు ఇస్తాం. పబ్లిక్ డొమైన్ లో పెట్టేటప్పుడు.. అన్ని న్యాయపరమైన అంశాలను పరిశీలిస్తాం. క్యాబినెట్‌లో చర్చించి, శాసన సభలో ప్రవేశ పెడతాం. మత ప్రాతిపదికన రిజర్వేషన్లు లేవు. మతాలు ప్రాతిపదిక కాదు. వెనుకబాటు తనమే మా ప్రాతిపదిక. బీజేపీ తొండి వాదన చేస్తోంది. తమ దగ్గర రీసెర్చ్ అండ్ అనాలసిస్ వివరాలు ఉన్నాయి. కేంద్రం బిల్లును ఆమోదించకపోతే, ఒత్తిడి తెచ్చేందుకు మా వ్యూహం మాకుంది." అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.



# యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండి..

## లక్ష్యం వైపు పయనించాలి

**-కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

విద్యార్థులు, యువత డ్రగ్స్ కు దూరంగా ఉండి, లక్ష్యం వైపు పయనించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు.మాదక ద్రవ్యాల, డ్రగ్స్ నియంత్రణ కోసం చేపట్టిన చర్యలపై బుధవారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి నార్కోటిక్ కంట్రోల్ సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ డ్రగ్స్, మాదకద్రవ్యాల నియంత్రణ కోసం జిల్లా నార్కోటిక్ సమావేశంలో పాల్గొనే ప్రతి శాఖ ప్రత్యేక కార్యచరణ రూపొందించుకొని అమలు చేయాలని అన్నారు. జిల్లాలో ఉన్న కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, ఇంటర్, డిగ్రీ కళాశాలలు, ఇంజనీరింగ్ ఇతర ఉన్నత విద్యా సంస్థల వద్ద డ్రగ్స్, మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై పోలీస్, ఎక్సైజ్ ఇతర శాఖల అధికారులు సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు.మాదక ద్రవ్యాలకు బానిసైన వారిని గుర్తించి అవసరమైన చికిత్స, కౌన్సిలింగ్ అందించేలా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య శాఖ అధికారులకు సూచించారు. ఆసుపత్రిలో డీ అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసి, అవసరమైన వారికి ఇక్కడ చికిత్స అందించాలని అన్నారు.అటవీ శాఖ అధికారులు వారి పరిధిలోని అటవీ భూములు పరిశీలించి గంజాయి సాగు కనిపిస్తే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలన్నారు. జిల్లాలోని ఆసుపత్రులు, మెడికల్ షాపులలో స్టాక్ వివరాలను ప్రతి నెల తనిఖీ చేయాలని డ్రగ్ ఇన్స్ పెక్టర్ కు ఆదేశించారు.

ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులకు , యువతకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, వ్యాస రచన, డ్రాయింగ్ పోటీలు చేపట్టి విజేతలకు బహుమతులు అందజేశామని తెలిపారు. యువత గంజాయి డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు.ఈ సమావేశంలో డీఎం హెచ్ ఓ రజిత, డీఏఓ అఫ్జల్ బేగం, కార్మిక శాఖ అధికారి నజీర్ అహ్మద్, డీఐఓ శ్రీనివాస్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రతిభ చాటిన దమ్మన్నపేట హైస్కూల్ విద్యార్థులు

**-విద్యార్థులను అభినందించి ఆర్థిక సాయం చేసిన పర్శ హన్మాండ్లు**

**బలగం టీవీ, గంభీరావుపేట**

స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ సైన్స్ ఎగ్జిబిషన్ పోటీల్లో ప్రతిభ చాటి పోటీలకు ఎంపికైన దమ్మన్నపేట ఉన్నత పాఠశాల విద్యార్థులకు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు అభినందించి ఆర్థిక సహాయం అందించారు. బుధవారం గంభీరావుపేట మండలం దమ్మన్నపేట జడ్పీ పాఠశాల ఆవరణలో విద్యార్థులను శాలులతో సన్మానించి ప్రోత్సాహంగా ?5000 ల ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం పర్శ హన్మాండ్లు మాట్లాడుతూ మారుమూల ప్రభుత్వ పాఠశా లలో చదువుకుంటూ కొత్త కొత్త ఆవిష్కరణ లో భాగంగా అడ్వాన్స్ వాషింగ్ మిషన్ ఆవిష్కరణ చేసిన మాలోత్ సుప్రియ, ఈరవేణి మధుప్రియ ,శ్రీ చైత్ర లకు శుభాకాంక్షలు తెలిపారు,భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు అధిరోహించాలని పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని అన్నారు.దేశ రాజధాని ఢిల్లీలో సైన్స్ ఎగ్జిబిషన్లో ఈ కొత్త ఆవిష్కరణను ఈ విద్యార్థులు ప్రదర్శించడం దమ్మన్నపేట పాఠశాలకే గాక గంభీరావుపేట మండలానికి సిరిసిల్ల జిల్లాకే గర్వకారణం అని అన్నారు.ప్రతిభకు పేదరికం అడ్డురాదన్నారు ,విద్యార్థులు తనకిష్టమైన రంగాన్ని ఎంచుకోవాలన్నారు.ప్రభుత్వ పాఠశాలలో 95 శాతం మంది బడుగు బలహీన వర్గా పిల్లలే చదువుకుంటున్నారని వారికి అందరికీ ప్రభుత్వము అన్ని విధాల వసతులు కల్పిస్తుందని అన్నా రు. బీద విద్యార్థుల కొరకు చదువుకు ఆటంకం కలగకూడదని రెసిడెన్షియల్ స్కూల్స్ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం స్థాపించిందని వాటిని సద్వినియోగ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.విద్యార్థులు లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకెళితే భవిష్యత్తులో అది సాధించి తీరుతారని ఆ ఆత్మవిశ్వాసంతో చదువుకోవాలని పిలుపునిచ్చారు ,ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బోయన్న గారి నారాయణ ,సైన్స్ టీచర్ సంపత్ కుమార్,కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఎండి అమిద్,జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కొమిరిశెట్టి తిరుపతి ,నాయకులు భూమరాజాం ,అజ్మీర భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు పెద్దపీట

**-200 కొట్లు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణలు**

**-ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ:**

ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు పెద్ద పీట వేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం మరో మైలురాయిని అధిగమించిన నేపథ్యంలో వేములవాడ పట్టణంలోని ఆర్టీసి డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన సంబరాల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు.. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన మహిళలను, విద్యార్థులను ప్రభుత్వ విప్ సన్మానించారు...ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే కాంగ్రెస్ సర్కార్ 2023 డిసెంబర్ 9న మహాలక్ష్మి పేరిట మహిళల కోసం ప్రారంభించిన ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం పథకం కింద గత 18 నెలల్లో రికార్డు స్థాయిలో 200 కోట్ల మంది ప్రయాణించారని, తద్వారా 6680 మేర కొట్లు మహిళలకి అదా అయ్యిందని అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో చాలా వరకు మహిళలు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా మిగిలిన డబ్బులను ఆదాచేసుకుని వాటి ద్వారా చిట్టీలు వేస్తున్నామని మహిళలు చెప్పడం ప్రజా ప్రభుత్వనికి గర్వకారణం అని అన్నారు..

వేములవాడలో డిపో పరిధిలో 6 మండలాలు పరిధిలో మహిళా ప్రయాణికులు సుమారు 1 కోటి 55 లక్షలు మంది ప్రయాణం చేశారని తద్వారా 57 కోట్ల 66 లక్షలు రూపాయలను హెూదా చేసుకున్నారని ప్రతిరోజు సంఘటన 26,330 మంది మహిళలు ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్నారని అన్నారుమహిళలకు 500 కే ఉచిత సిలిండర్, గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్,రైతులకు రుణమాఫీ, ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం చేపట్టడం జరుగుతుం దన్నారు.గత పది సంవత్సరాలలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, కానీ ప్రజా ప్రభుత్వంలో నూతన రేషన్ కార్డులు మంజూరు చేయడం జరిగిందన్నారు.ఆనాడు ఆర్టీసీ సంస్థ సంక్షోభంలో ఉండేదని, ప్రజా ప్రభుత్వంలో ఆర్టీసీ డిపోల్లో ప్రయాణికులతో కిటకిట లాడుతు న్నాయని,బస్సు ప్రయాణాలు జరగడం వలన చిరు వ్యాపారులకు, కిరాణా దుకాణ దారులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు..

**ఇప్పటికైనా కెటిఆర్, హరీష్ రావు ఉచిత బస్సు ప్రయాణంలను స్వాగతించాలి**



ప్రజా ప్రభుత్వం ఏర్పడిన మూడు రోజుల్లోనే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టిన తొలినాళ్లలో మహిళను అవమానపరిచేలా కెటిఆర్,హరీష్ రావు లు చులకనగా చూస్తూ మాట్లాడారని అన్నారు. మహిళలు ఉచిత బస్సు ప్రయాణాన్ని సద్విని యోగం చేసి 200 కోట్ల ప్రయాణాలు చేశారని ఇప్పుడు కేటిఆర్ , హరీష్ రావు ఏమంటారని ప్రశ్నించారు.. ఇప్పటికైనా కెటిఆర్ హరీష్ రావు మహిళలు క్షమాపణ చెప్పాలని ఈ పథకం దిగ్విజయంగా కొనసాగడం పట్ల వారు ప్రభుత్వానికి అభినందలు తెలపాలని సూచించారు..

మహిళలు దర్జాగా ఆర్టీసి బస్సులు తమ స్వంత వాటిగా భావించి ప్రయాణాలు చేస్తున్నరని అన్నారు..మన ప్రాంతంలో బస్సు ల సంఖ్య తక్కువగ ఉంటే మొన్న జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో బస్సుల సంఖ్య పెంచాలని కోరడం జరిగిందని,ఇప్పటికే కొన్ని బస్సులను పెంచడం జరిగిందని త్వరలోనే ఇంకా బస్సుల సంఖ్య పెంచడం జరుగుతుందన్నారు...

**త్వరలోనే తిప్పాపూర్ బస్టాండ్ కు నూతన శోభ**

గత ప్రభుత్వంలో తిప్పాపూర్ బస్ స్టాండ్ తీసివేస్తం అంటే నిలబడి దానిని ఆపడం జరిగిందన్నారు.. తిప్పాపూర్ నుండీ రోడ్డు వెడల్పు పనులు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు.. భూ నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు.. రోడ్డు నిర్మాణం పూర్తయితే తిప్పాపూర్ బస్టాండుకు నూతన శోభ సంతరించుకుంటుందని అన్నారు..మంత్రి పొన్నం ప్రభాకర్ తో మాట్లడి తిప్పాపూర్ బస్టాండ్ కి నూతన శోభ సంతరించుకునేలా బస్టాండును తీర్చి దిద్దుతానని అన్నారు..

**మహిళలు కోటీశ్వరులు చేయడమే లక్ష్యం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయాలనే సంకల్పంతో ముందుకు పోతు న్నారని అన్నారు.. అందులో భాగంగా రాష్ట్రంలో ఇందిరా మహిళా శక్తి పథకాన్ని ప్రారంభించడం జరిగిందని తద్వారా మహిళలకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేసి వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి సంకల్పించారని అన్నారు..

అనాడు ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు మేలు జరిగితే మళ్లీ రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వంలో మహిళా తల్లిలకు పేద్దపీఠ వేయడం జరుగుతుందని అన్నారు..గతంలో వైఎస్ పావలా వడ్డీకే రుణాలు మంజూరు చేశారని, ఐకేపీ కేంద్రాలను ప్రారంభం చేసి మహిళలకు ఆర్థిక స్వావలంబన దిశగా ప్రోత్సాహం అందించాలని,ప్రజా ప్రభుత్వంలో మహిళలకు 20వేల పైచిలుక కోట్లను కేటాయించడం జరిగిందని అన్నారు..

గత ప్రభుత్వం మహిళా సంఘంలను ఏ మాత్రం పట్టించుకోలేదని చివరికి మూడు సంవత్సరాల వడ్డీని ఎగ్గొట్టినట్లు తెలిపారు..మహిళా సంఘాల ద్వారా సోలార్ విద్యుత్ ప్లాంట్, ఆర్టీసీ సంస్థకు అద్దె బస్సులు, పెట్రోల్ పంప్, ధాన్యం కొనుగోలు, రైస్ మిల్ వంటి అనేక వ్యాపారాలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం నూతనంగా అందించే రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లను కూడా మహిళల పేరు మీద మంజూరు చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్,సిఐ విర ప్రసాద్,డిపో మేనేజర్ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, మాజి కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఆర్టీసి సిబ్బంది, ప్రయాణికులు తదితరలు పాల్గొన్నారు...

# ఇల్లంతకుంటలో విద్యాసంస్థల బంద్ విజయవంతం

- **ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మంద అనిల్ కుమార్**

**బలగం టీవీ, ఇల్లంతకుంట**




తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు ,జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ,ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడినీ అరికట్టాలని,రాష్ట్రంలో విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని నియమించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త పాఠశాలు,జూనియర్ కళాశాలల బంద్ ఇల్లంతకుంట మండల కేంద్రంలో విజయవంతమైంది.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మంద అనిల్ కుమార్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని,పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్స్, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.గురుకులాలకు స్వంత భవనాలు నిర్మించాలని,మెస్ కాస్మోటిక్ ఛార్జీలను పెంచాలని.విద్యాశాఖ మంత్రిని తక్షణమే నియమించాలని అన్నారు. విద్యారంగ సమస్యను పరిష్కరించాలని, వామపక్ష విద్యార్థి సంఘాలు తలపెట్టిన విద్యాసంస్థల బంద్ కు సహకరించి, విజయవంతం చేసిన విద్యాసంస్థలకు, ఉపాధ్యాయులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లంతకుంట మండల అధ్యక్షులు బండారి చందు గౌడ్,పున్ని పవన్, దొమ్మటి శ్రీహరి, గుంటి రాజు , జామచెట్టి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# రసవత్తర ఆరంభం



- భారత్ 264/4
- జైస్వాల్, సుదర్శన్ హాఫ్ సెంచరీలు
- పంత్‌కు గాయం,

**బలగం టీవీ, మాంచెస్టర్**

అండర్సన్–సచిన్ ట్రోఫీగా జరుగుతున్న ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా భారత్–ఇంగ్లండ్‌ల మధ్య నాలుగో టెస్ట్ బుధవారం మాంచెస్టర్ వేదికగా ప్రారంభమైంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్, తొలి రోజు ఆట ముగిసే సమయానికి నాలుగు వికెట్లు కోల్పోయి 264 పరుగులు చేసింది.

### ఓపెనర్ల శుభారంభం

కేఎల్ రాహుల్ (46), యశస్వి జైస్వాల్ (58) తొలి వికెట్‌కు 94 పరుగుల భాగస్వామ్యం అందించడంతో భారత్‌కు మంచి ఆరంభం లభించింది. పిచ్ స్వింగ్‌కు అనుకూలంగా ఉండడంతో ఆచితూచి ఆడిన భారత ఓపెనర్లు బౌండరీలు సాధించారు. లంచ్ సమయానికి స్కోరు 78/0గా ఉంది.

లంచ్ అనంతరం ఇంగ్లండ్ బౌలర్లు దూకుడుగా బౌలింగ్ చేసి భారత్‌కు షాక్ ఇచ్చారు. క్రిస్ వోక్స్ బౌలింగ్‌లో రాహుల్ ఔటవ్వగా, లియామ్ డాన్ వేసిన తొలి బంతికే జైస్వాల్ వికెట్ కోల్పోయాడు. శుభ్‌మన్ గిల్ (12) కూడా బెన్ స్టోక్స్ బౌలింగ్‌కు ఎల్బీగా అవుట్ అయ్యాడు.

రిషభ్ పంత్ (37) తనదైన శైలిలో బ్యాటింగ్ చేస్తూ జోరు చూపిస్తున్న సమయంలో.. క్రిస్ వోక్స్ బౌలింగ్‌లో రివర్స్ స్వీప్ ప్రయత్నించగా గాయపడ్డాడు. తీవ్ర గాయం కారణంగా రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన పంత్‌ను అంబులెన్స్‌లో బయటకు తరలించారు.

అనంతరం సుదర్శన్ (61) అద్భుతంగా ఆడి హాఫ్ సెంచరీ సాధించాడు. కానీ స్టోక్స్ బౌలింగ్‌లో షార్ట్ పిచ్ బంతిని మిస్ చేసి క్యాచ్ ఇచ్చాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన జడేజా (19 నాటౌట్), శార్దూల్ ఠాకూర్ (19 నాటౌట్) జతగా ఆచితూచి ఆడి రోజు ఆటను ముగించారు.స్టోక్స్ 2 వికెట్లు, వోక్స్ 1 వికెట్ తీసుకున్నారు. స్పిన్నర్ లియామ్ డాన్ ఒక కీలక వికెట్ తీశాడు. టీమిండియా ఓపెనర్ల తీరుతో మంచి ప్రారంభం పొందినా, మిడిల్ ఆర్డర్ లో వికెట్లు పడటంతో మ్యాచ్ ఉత్కంఠభరితంగా మారింది.



# చివరి టీ20లో చెలరేగిన రస్సెల్

**బలగం టీవీ, హైదరాబాద్**

వెస్టిండీస్ ఆల్‌రౌండర్ ఆండ్రే రస్సెల్ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాడు. బుధవారం సబినా పార్క్ వేదికగా ఆస్ట్రేలియాతో జరిగిన తన చివరి టీ20 మ్యాచ్‌లో 37ఏళ్ల రస్సెల్ ఉత్సాహభరితంగా ఆడి 15 బంతుల్లో 36 పరుగులు చేసి చెరగని గుర్తింపుని అందించాడు. రస్సెల్ కెరీర్‌లో మొత్తంగా 86 టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడుతూ, 1122 పరుగులు చేశాడు. అద్భుతమైన 163 స్ట్రైక్‌రేట్‌తో రన్‌ల వేట సాగించాడు. అంతేకాకుండా బౌలింగ్‌లోనూ కీలక పాత్ర పోషిస్తూ 61 వికెట్లు పడగొట్టాడు.

ఆఖరి మ్యాచ్‌లో ఫీల్డింగ్‌కు వస్తున్న సమయంలో ఇద్దరు జట్ల ఆటగాళ్లు కలసి రస్సెల్‌కు గార్డ్ ఆఫ్ హానర్ ఇచ్చారు. ఇది ఎంతో భావోద్వేగభరిత దృశ్యంగా మారింది.

ఇక సబినా పార్క్ మ్యాచ్‌లో వెస్టిండీస్ తొలుత బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 172 పరుగులు చేసింది. ఓ దశలో 98 పరుగులకే 5 కీలక వికెట్లు కోల్పోయిన ఆ జట్టును రస్సెల్ నిలబెట్టాడు. నాలుగు సిక్సర్లు, రెండు ఫోర్లతో తన ఇన్నింగ్స్ ద్వారా ఆకట్టుకున్నాడు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన ఆస్ట్రేలియా జట్టు కేవలం రెండు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని 16వ ఓవర్లోనే ఛేదించింది. జోష్ ఇంగ్లిష్, కెమెరూన్ గ్రీన్‌లు హాఫ్ సెంచరీలతో రాణించారు. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో తొలి రెండు గేమ్‌లను ఆస్ట్రేలియా గెలుచుకుని ఆధిక్యంలోకి వెళ్లింది.

## టెస్టు అరంగేట్రం చేసిన కాంబోజ్

**బలగం టీవీ, మాంచెస్టర్**

ఇంగ్లండ్‌తో జరుగుతున్న నాలుగో టెస్టులోభారత్ తరఫున ఈ మ్యాచ్‌లో మూడు కీలక మార్పులు చేశారు. కరుణ్ నాయర్ స్థానంలో యువ బ్యాటర్ సాయి సుదర్శన్కు అవకాశం లభించగా, నితీశ్ రెడ్డి స్థానంలో శార్దూల్ ఠాకూర్, ఆకాశ్ దీప్ స్థానంలో అన్షుల్ కాంబోజ్ జట్టులోకి వచ్చారు. వాషింగ్టన్ సుందర్‌కు కూడా జట్టులో స్థానం దక్కింది.

ఈ మ్యాచ్ ద్వారా హర్యానా ఫాస్ట్ బౌలర్ అన్షుల్ కాంబోజ్ భారత టెస్టు కెరీర్‌కు శుభారంభం చేస్తున్నాడు. అతను భారత్ తరఫున టెస్టు ఆడిన 318వ క్రికెటర్గా నిలిచాడు. 24 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల్లో ఇప్పటివరకు 79 వికెట్లు సాధించిన కాంబోజ్, ఇటీవల రంజీ ట్రోఫీలో కేరళపై ఒకే ఇన్నింగ్స్‌లో 10 వికెట్లు తీయడంతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాడు.

ఇంగ్లండ్ లయన్స్‌తో నార్తాంప్టన్‌లో జరిగిన మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లో నాలుగు వికెట్లు తీసిన కాంబోజ్, 51 పరుగులు చేసి బ్యాటుతో కూడా మెరిశాడు. ఆ మ్యాచ్ డ్రా అయింది. అన్షుల్ కాంబోజ్, ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఆడుతున్నాడు. ఐపీఎల్ 2024లో ముంబైకి చెందిన మూడు మ్యాచ్‌లలో రెండు వికెట్లు తీసిన అతను, సీజన్ మొత్తం 8 మ్యాచ్‌ల్లో 8 వికెట్లు పడగొట్టాడు.






## చిరంజీవి-అనిల్ రావిపూడి సినిమా.. కేరళ షెడ్యూల్ పూర్తి

**బలగం టీవీ, హైదరాబాద్**

టాలీవుడ్ మెగాస్టార్ చిరంజీవి ప్రధాన పాత్రలో, యంగ్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో రూపొందుతున్న తాజా చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. తాజాగా కేరళ షెడ్యూల్ను విజయవంతంగా పూర్తి చేశారు. ఈ విషయాన్ని దర్శకుడు అనిల్ రావిపూడి స్వయంగా సోషల్ మీడియాలో వెల్లడించారు. “మన శంకరవరప్రసాద్ గారు ముచ్చటగా మూడో షెడ్యూల్‌ను కేరళలో పూర్తిచేసుకుని వచ్చారు” అంటూ ఓ వీడియోను షేర్ చేశారు. అందులో చిరంజీవి, అనిల్ రావిపూడి సహా చిత్రబృందం చార్టర్డ్ ఫ్లైట్‌లో హైదరాబాదుకు చేరుకున్న దృశ్యాలు కనిపించాయి.

ఈ సినిమాకు ఇప్పటి వరకూ అధికారికంగా టైటిల్ ఖరారు చేయలేదు. ‘మెగా157’ అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ ప్రాజెక్ట్‌పై మేకర్స్ ప్రమోషన్ చేస్తున్నారు. చిరంజీవి సరసన నయనతార కథానాయికగా నటిస్తుండగా, ఆయన కుమార్తె సుష్మిత చిరంజీవి, సాహు గారపాటి కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సంగీతాన్ని యువ సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో అందిస్తున్నాడు.

## సూర్య ‘కరుప్పు’ టీజర్ రిలీజ్

**బలగం టీవీ, హైదరాబాద్**



తమిళం, తెలుగులో వినూత్న కథా చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న స్టార్ హీరో సూర్య, ఇటీవల వరుసగా పెద్ద విజయం లేక నిరీక్షణలో ఉన్నారు. అయితే బుధవారం తన పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు ప్రత్యేక కానుగా తన 45వ చిత్రం ‘కరుప్పు’ టీజర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రానికి ఆర్జే బాలాజీ దర్శకత్వం వహిస్తున్నారు. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ సినిమాలో సూర్య పూర్తి స్థాయి మాస్ అండ్ యాక్షన్ పాత్రలో కనిపించనున్నారు. “కొబ్బరికాయ కొట్టి కర్పూరం వెలిగిస్తే శాంతించే దేవుడు కాదు.. మనసులో మొక్కుకొని మిరపకాయలు దంచితే రుద్రుడై దిగొచ్చే దేవుడు” అనే డైలాగ్‌తో ప్రారంభమైన టీజర్‌కు అభిమానుల నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది.

టీజర్‌లో సూర్య ఓ బహుముఖ వ్యక్తిత్వం కలిగిన పాత్రలో కనిపించారు. సాధారణ జనానికి దేవుడిగా కనిపించే పాత్రను ఆయన పోషిస్తున్నట్టు కనిపించింది. భిన్నమైన లుక్, ఊహించని యాంగిల్‌తో ఆయన అభిమానం గల వారిని అలరించనున్నారు. ఈ చిత్రంలో త్రిష, ఇంద్రన్స్, నట్టి, స్వసిక తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. సంగీతం: సాయి అభ్యంకర్ నిర్మాతలు: ఎస్.ఆర్. ప్రభు, ప్రకాశ్ బాబు. రచన, దర్శకత్వం: ఆర్జే బాలాజీ

## భద్రకాళి’గా విజయ్ ఆంటోని

### సెప్టెంబర్ 5న థియేటర్లలో గ్రాండ్ రిలీజ్


**బలగం టీవీ, హైదరాబాద్**

తమిళ నటుడు విజయ్ ఆంటోని హీరోగా నటిస్తున్న 25వ సినిమా ‘భద్రకాళి’ విడుదలకు సిద్ధమైంది. అరుణ్ ప్రభు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం తమిళంలో ‘శక్తి తిరుమగన్’, తెలుగులో ‘భద్రకాళి’ పేరుతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. తాజాగా చిత్ర బృందం సెప్టెంబర్ 5, 2025న ఈ సినిమాను థియేటర్లలో విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించింది.

ఈ చిత్రం రూ. 190 కోట్ల కుంభకోణం చుట్టూ నడిచే కథాంశంతో రూపొందుతోంది. రాజకీయ నేపథ్యంతో కూడిన యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. విజయ్ ఆంటోని పాత్రకు వేరే షేడ్స్ ఉంటాయని, అది చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని తెలిపారు.

## నేడు థియేటర్లలోకి ‘హరిహర వీరమల్లు’

**బలగం టీవీ, హైదరాబాద్**




పవర్‌స్టార్ పవన్ కల్యాణ్ హీరోగా నటించిన భారీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా ‘హరిహర వీరమల్లు’ రేపు (జూలై 24) థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. ఇప్పటికే అడ్వాన్స్ బుకింగ్స్ ఊహించని స్థాయిలో కొనసాగుతున్నాయి. టికెట్లు హాట్ కేకుల మాదిరిగా అమ్ముడవుతుండగా, అభిమానులు పూనకాలతో నిండిపోయారు. పవన్ కల్యాణ్ కెరీర్‌లో ఇది మళ్లీ భారీ బడ్జెట్ సినిమా. ‘హరిహర వీరమల్లు’ చిత్రం పవన్ అభిమానుల్లో భారీ అంచనాలను రేకెత్తిస్తోంది. పీరియాడిక్ కథాంశంతో, పవన్ ఓ యోధుడిగా, వీరుడిగా స్క్రీన్‌పై కనిపించనున్న ఈ చిత్రం విజువల్స్, మేకింగ్‌కి సంబంధించి ఇప్పటివరకు విడుదలైన ప్రచార సామగ్రి సినిమాపై ఆసక్తిని పెంచింది.

## రానాకు మరోసారి నోటీసులు

**బలగం టీవీ, హైదరాబాద్**

బెట్టింగ్ యాప్‌ల కేసులో సినీ నటుడు రానా దగ్గుబాటికి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మరోసారి నోటీసులు జారీ చేసింది. విచారణకు హాజరయ్యేందుకు గడువు కావాలని రానా ఈడీని కోరారు. ఈ నేపథ్యంలో ఈడీ ఆయన విజ్ఞప్తిని మన్నించి, మరో తేదీని ఖరారు చేసింది. ఆగస్టు 11న తప్పకుండా విచారణకు హాజరు కావాలని తాజా నోటీసుల్లో పేర్కొంది. బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసినందుకు నిర్వాహకులు ఇచ్చిన పారితోషికానికి సంబంధించి మనీలాండరింగ్ జరిగిందనే అనుమానంతో ఈడీ దర్యాప్తు చేస్తోంది. ఈ క్రమంలో రానాతో పాటు సినీ నటులు ప్రకాశ్ రాజ్, విజయ్ దేవరకొండ, మంచు లక్ష్మి తదితరులకు ఈడీ నోటీసులు జారీ చేసింది.

ఇంతకుముందు ఇచ్చిన నోటీసులు ప్రకారం రానా జులై 23 విచారణకు హాజరు కావాల్సి ఉంది. అయితే, ఆయన ముందుగా నిర్ణయించిన కార్యక్రమాలు, సినిమా షూటింగ్‌ల కారణంగా విచారణకు హాజరు కాలేనని, కొంత గడువు కావాలని రానా కోరారు. ఆయన విజ్ఞప్తికి ఈడీ అంగీకరించింది. మంచు లక్ష్మి కూడా విచారణకు హాజరు కావడానికి సమయం కోరారు.